క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురంలో ఎమ్మెల్యే గణబాబు బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. జీవీఎంసీ,రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. అయితే చాలా మంది మహిళలు తమకు కార్డులు ఇప్పించాలని కోరారు. అర్హులైన తమకు పింఛన్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ముందు వాపోయారు.అర్హులైన వారికి పింఛన్లు,రేషన్‌కార్డులు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీను,నాయకులు రామ్మోహన్‌నాయుడు,పోతబత్తుల శ్రీను పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డులోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ లో ఆ సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ బి.ఝాన్సీ లక్ష్మీ బాయి జన్మదినం సందర్భంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వైజాగ్ సిటీ శ్రీ చైతన్య స్కూల్స్ రీజినల్ ఇన్‌చార్జి అహ్మద్ అలీ మాట్లాడుతూ రోజూ చాలా మంది సకాలంలో అవసరమైన రక్తం అందక ప్రాణాలు విడుస్తున్నారని, దాని వల్ల చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. అలా జరగకుండా తమ విద్యా సంస్థల తరఫున మా సామాజిక బాధ్యతగా రక్తదాన శిబిరం ప్రతి ఏటా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు జె.మహేష్ , పి.తారకేశ్వరరావు, లతా సువర్ణ,డీన్ ఎం.శ్రీనివాస్,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో పశుగణన



జీవీఎంసీ 40వ వార్డులో వివరాలు సేకరిస్తున్న పశువైద్య సిబ్బంది

సింధియా : పారిశ్రామిక ప్రాంతం జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో గాంధీ గ్రామం పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ సూచనల మేరకు బుధవారం అఖిల భారత పశుగణనను జోరుగా నిర్వహించారు. ప్రభుత్వం నియమించిన సిబ్బంది వార్డులో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. అఖిల భారత పశుగణన వల్ల పశువుల సంఖ్య, రకాలు, ఉత్పత్తి మొదలగు విషయాలు క్షుణ్ణంగా తెలుసుకోవచ్చని, తద్వారా పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తిని పెంచవచ్చన్నారు. ప్రజంతా సిబ్బందికి సరైన సమాచారమివ్వాలని డాక్టర్ సునీల్‌కుమార్ కోరారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో డిసెంబర్ 5 నుంచి 7 వరకు 'నానో మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ క్యాటలిసిస్ అండ్ ఎన్విరాన్మెంట్' అనే అంశంపై నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. డీఎస్‌టీ-ఫిస్ట్ పథకంలో భాగంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఇందులో నానో మెటీరియల్స్, క్యాటలిసిస్, ఫోటో క్యాటలిసిస్, బయోమాస్ కన్వర్షన్ తదితర అంశాలపై నిపుణుల ప్రసంగాలు, పరిశోధనా పత్రాల సమర్పణ ఉండనున్నాయి. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ఆచార్య టి.శివరావు, విభాగ ఆచార్యులు పి.శ్యామల, బి.బి.వి.శైలజ, వి.సిద్ధయ్య, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మామూలే..!

నాడు ప్రజల అవసరాల కోసం లక్షల వ్యయంతో ఇరుగ్గా ఉన్న మార్గాన్ని విశాలం చేశారు. నేడు కొందరి స్వార్థంతో ఆ విశాలమైన మార్గం ఇరుకుమయంఅవుతోంది. అయినా అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరం.ఫలితంగా ఆ మార్గంలో రాకపోకలు సాగించ లేక పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



ఆక్రమణలతో కుదించుకుపోయిన రోడ్డు

- ప్రజా అవసరాల కోసం రోడ్డు విస్తరణ
- కొందరి స్వార్థంతో ఇరుకుమయం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, పాదచారులు
- కన్నెత్తి చూడని అధికారులు



రోడ్డు విస్తరణకు ముందు ఇలా..

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం కృష్ణ రెస్టారెంట్ అండ్ బార్ వెనుక ఇరుకు మార్గం ఉండేది.ప్రకాష్‌నగర్,జనతాకాలనీ,టీడీపీకాలనీ,అచ్చినాయుడులోవ వంటి ప్రాంతాల ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు.వారితో పాటు మల్కాపురం,గాంధీజీవీధి తదితర ప్రాంత వాసులు కూడా ఈ మార్గం ద్వారానే ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. 2014 ముందు వాహనాల వినియోగం తక్కువగా ఉండేది. జన సంచారం అంతగా లేకపోవడంతో ఇరుకు మార్గమైనా పెద్దగా ఇబ్బందులు తలెత్తేవి కావు. అయితే 2014 తర్వాత జన సంచారంతో పాటు వాహనాలు,కార్ల సంఖ్య పెరగడంతో ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తేవి.దీనికి తోడు ఇరువైపులా ఆటోలు,ట్రాక్టర్లు పార్కు చేయడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు.

మళ్ల చొరవతో రోడ్డు విస్తరణ

అప్పుడు పశ్చిమ ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ రోడ్డు విస్తరణకు ఉపక్రమించారు. ఆ సమయంలో స్థానికులు కొంత మంది వ్యతిరేకించినా అందరి ప్రయోజనాల దృష్ట్యా రోడ్డును 40 అడుగుల మేర విస్తరించారు. దీనికి నాడు సుమారు రూ. 20 లక్షల వరకు జీవీఎంసీ నిధులు ఖర్చు చేశారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులతో పాటు,పాదచారులు మళ్ల విజయప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఈ ముచ్చట ఎంతో కాలం లేదు. మరలా కొంతమంది తమ వాహనాలు రోడ్డుకు ఇరువైపులా పార్కు చేయడం.. నిర్మాణాలు ముందుకు పెంచడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. రోడ్డుపై ఇసుక,పిక్క వంటివి డంప్ చేయడంతో ఎప్పటి తిప్పలు తప్పలేదని ఈ ప్రాంత వాసలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాహనం తప్పించుకోలేని పరిస్థితి



రోడ్డు విస్తరించిన ప్రయోజనం లేదు. గతంలో రోడ్డు ఎలా ఉండేదో ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొంది. లక్షల వ్యయంతో ఈ మార్గాన్ని విశాలం చేసినా ఫలితం లేదు.ఉదయం, సాయంత్రం అయితే చాలు ఈ మార్గంలో రాకపోకలకు ఇబ్బందే. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్క్ చేస్తున్నారు. దీంతో వాహనాలు తప్పించుకోలేని పరిస్థితి ఉంది.

–నర్సింగ్‌రావు, వాహనదారుడు

కొందరి స్వార్థం వల్లే సమస్య



కొంత మంది స్వార్థం కారణంగా ఈ మార్గం ఇరుగ్గా మారుతోంది.రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుపుతున్నారు. రద్దీగా ఉండే మార్గంలో భవన నిర్మాణ సామగ్రి వేస్తున్నారు. కొంత మంది కాలువదాటి నిర్మాణం చేపట్టారు. దీంతోఈ మార్గం ఇరుగ్గా మారుతోంది.

–ఖాన్ ,స్థానిక వాసి

యువతలో మంచి మార్పు తీసుకురావాలి

విశాఖ సిటీ: యువతలో మంచి మార్పును తీసుకొచ్చేలా జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు పనిచేయాలని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు సూచించారు. ఏయూ ఎన్ఎస్ఎస్ సమావేశ మందిరంలో హెరిటేజ్ ఫౌండేషన్‌తో సంయుక్తంగా బుధవారం ప్రోగ్రాం అధికారులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. వీటిని ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విభిన్న తరాల మనుషుల్లో వస్తున్న మార్పులను సునిశితంగా పరిశీలించాలన్నారు. వృద్ధులను సమాజానికి ఉపయుక్తంగా చేసుకుంటూ, వారి నుంచి విలువలు, క్రమశిక్షణ నేటి తరానికి అందించడం అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ నేడు వృద్ధులు ఒంటరిగా మారిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. వారు సామాజిక, మానసిక, ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపే విధంగా యువతను వృద్ధులతో అనుసంధానం చేయడమే సరైన పరిష్కారమని వివరించారు. హెరిటేజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్.ఆర్.గంగాధరన్ మాట్లాడుతూ ఒకరిని మరొకరు అర్థం చేసుకుంటే సమస్యను పరిష్కరించడం సాధ్యపడుతుందన్నారు. వృద్ధుల సంఖ్య పట్టణాల్లోనే కాకుండా గ్రామాల్లో సైతం పెరుగుతోందని చెప్పారు. ప్రజల జీవన, ఆరోగ్య ప్రమాణాలు కూడా పెరగడం దీనికి ఒక కారణంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా సమన్వయకర్తలు, ఆచార్య ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

గౌరీపరమేశ్వరులకు పూజలు

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, రెడ్డివీధి వద్ద గౌరీపరమేశ్వరులకు బుధవారం సాయంత్రం వైభవంగా పూజలు చేశారు. స్థానిక నాయకుడు కాకి పోలిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలో ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, సేవ గరిడీ, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆకాశ దీపానికి పూజలు

మల్కాపురం : జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయంలో బుధవారం సాయంత్రం ఆకాశదీపం పూజలు చేశారు. ఏటా కార్తీక మాసంలో పాడ్యమి నుంచి అమావాస్య వరకు ఆకాశదీపం పూజలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా అర్చకులు చంద్రశేఖర్ శర్మ మందిరం వద్ద పూజలు చేశారు. అనంతరం దీపం వెలిగించి ఆకాశం వైపు వదిలారు.

జీతాలు ఇవ్వాలని 104 సిబ్బంది వినతి

మహారాణిపేట: తమ డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విశాఖలోని 104 సిబ్బంది జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకి 3 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, దీంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా ఉందని వాపోయారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈవోలకు జీవో 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. డీఎస్‌సీ ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టులో పెట్టాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలని కోరారు. ఉద్యోగులకు యాజమాన్యం నుంచి రావలసిన ఇతర బకాయిలు చెల్లించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చెయ్యాలన్నారు. సీఐటీయూ నేత మణి సహకారంతో 104 సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు తాత బాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్, కోశాధికారి ప్రకాష్, 104 ఉద్యోగులు డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేశారు.



డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

రేపు జాబ్‌మేళా

గాజువాక: జిల్లా నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఆ సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. పెదగంట్యాడలోని ఎన్ఏసీ సెంటర్‌లో మేళా నిర్వహిస్తామన్నారు. బంధన్ బ్యాంక్, బిగ్ బాస్కెట్ ప్రైవేట్ లిమిటెడ్, భారత్ పే కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఇంటర్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. వివరాల కోసం 7981022453 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

ప్రైవేటీకరణ దేశ ద్రోహంతో సమానం

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 1318వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షను ఉద్దేశించి సీఐటీయూ సీనియర్ నాయకుడు వై. రాజు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజల ఉద్దేశాలకు వ్యతిరేకంగా గత పది సంవత్సరాలుగా వ్యవహరిస్తుందన్నారు. దానిలో భాగంగానే ప్రభుత్వ రంగంలో కొనసాగుతున్న సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తుందని అన్నారు. నిజమైన దేశద్రోహం అంటే ఇదేనని తెలిపారు. ఎం. సుబ్బారావు మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఎవరి దయాదాక్షిణ్యంతో వచ్చింది కాదన్నారు. 32 మంది ప్రాణత్యాగంతో, 62 గ్రామాల ప్రజలు ఇళ్లు, భూములు, జీవనాధారమైన ఆస్తులని ధారాదత్తం చేస్తే వచ్చిందన్నారు. 61 మంది సీపీఎం నాయకులు తృణప్రాయంగా పదవులు త్యాగం చేస్తే వచ్చిన ఫలితమని తెలిపారు. దీన్ని ముట్టుకునే హక్కు బీజేపీకి లేదన్నారు. స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించుకోవటమే నిజమైన దేశభక్తి అన్నారు. మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, ముఠా కళాసీ యూనియన్ నాయకులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ ప్రతినిధులు

18 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న నిందితుడిని విశాఖపట్నం రైల్వే పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ రామారావు, ఆర్పీఎఫ్ ఎస్ఐ పీఆర్ బిషోయి సిబ్బందితో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్రం, గజపతి జిల్లాకు చెందిన బల్లా అన్నాజీ వద్ద 18 కేజీల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తి పాడేరు నుంచి ముంబయికి విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయి తరలిస్తున్నట్లు నిర్ధారించారు. నిందితుడిని జీఆర్పీ సిబ్బందికి అప్పగించగా రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

క్యూఆర్ కోడ్‌తో చెల్లింపులు చేయండి

తాటిచెట్లపాలెం: డిజిటల్ ఇండియాలో భాగంగా ఆన్‌లైన్ నగదు చెల్లింపులను క్యూఆర్ కోడ్ వినియోగిస్తూ చేయాలని రైల్వే అధికారులు సూచించారు. ఈ విషయమై వాల్తేర్ డివిజన్ పరిధిలో గల శ్రీకాకుళం రోడ్, విజయనగరం, రాయగడ, విశాఖపట్నం స్టేషన్లలో కమర్షియల్ సిబ్బంది ప్రయాణికులకు అవగాహన కల్పించారు. రిజర్వేషన్ టికెట్లు, అన్ రిజర్వుడ్ టికెటింగ్ సిస్టం వద్ద చెల్లింపుల కోసం క్యూ ఆర్ కోడ్ విధానాన్ని డివిజన్ పరిధిలో పరిచయం చేశారు. నగదు రహిత చెల్లింపుల్లో భాగంగా ప్రయాణికులు సాధ్యమైనంత వరకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. క్యూఆర్ కోడ్ రైల్వేస్టేషన్లలోని బుకింగ్ కౌంటర్ల వద్ద, రిజర్వేషన్ కౌంటర్ల వద్ద అందుబాటులో ఉంటుందని, ప్రయాణికులు వినియోగించుకోవాలని డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్ ప్రసాద్ సూచించారు.



విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

హడలెత్తించిన నాగుపాము

ఉక్కునగరం: నాగుపాము ఉక్కు నగరవాసులను హడలెత్తించింది. టౌన్‌షిప్ సెక్టార్-11లోని 118ఎ క్వార్టర్ బాత్‌రూమ్‌లో బుధవారం సుమారు ఆరడుగుల నాగుపాము కనిపించింది. దీంతో నివాసులు భయంతో బయటకు పరుగులు తీశారు. వెంటనే స్నేక్ సేవర్ సొసైటీ కిరణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే క్వార్టర్‌కు చేరుకుని బాత్‌రూమ్ వద్దకు వెళ్లి చూడగా అక్కడ పాము ఇరుక్కు పోయింది. కిరణ్ ఆ పామును ఒడిసి పట్టుకున్నారు. దీంతో క్వార్టర్‌లో ఉన్నవారు ఊపిరిపీల్చుకున్నారు. పామును అటవీ శాఖ అధికారుల సూచన మేరకు వదిలిపెడతానని కిరణ్ తెలిపారు.



పట్టుకున్న పాముతో కిరణ్‌కుమార్

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

విశాఖ విద్య : గోపాలపట్నం మండలంలోని 11 కేవీ ఏపీఎస్ఈబీ ఫీడర్ నిర్వహణ పనులు కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్, ఏపీఎస్ఈబీ కాలనీ, సుసర్ల కాలనీ, సీతారామరాజునగర్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

కొన్ని ప్రాంతాల్లో రేపు అంతరాయం

మల్కాపురం : శ్రీహరిపురం సబ్ స్టేషన్ పరిధి 33 కేవీ ములగాడ కేంద్రంలో నిర్వహణ పనులు కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిలకవానిపాలెం, అన్నపూర్ణనగర్, ఉప్పరకాలనీ, రామ్‌నగర్, శ్రీనివాస్‌నగర్, గుల్లపాలెం, అశోక్‌నగర్, బర్మాకాలనీ, ఏదురవానిపాలెం, గొందేశివానిపాలెం, హనుమాన్ సంజీవ్‌కాలనీ, శ్రీరామ్‌నగర్, పవన్‌పుత్రనగర్, కోడిపందాలదిబ్బ, కుంచిమాంబకాలనీ, శ్రీహరిపురం మొయిన్‌రోడ్డు ఏరియా, ఎంజజీ - 1, 2 ఉడాకాలనీ, ఇందిరాకాలనీ - 1, 2, ములగాడ, చిన్నములగాడ, ములగాడ హౌసింగ్‌కాలనీ, ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

ములగాడలో పందులతో అవస్థలు

మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డు చిన్న ములగాడ గ్రామంలో పందుల సంచారం ఎక్కువ కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాల పందుల పెంపకందారులు వ్యాన్ల సాయంతో ములగాడ వద్ద గల గెడ్డలో పందులను విడిచిపెట్టి వెళ్లిపోతున్నారు. ఇవి గెడ్డలో సంచరించినంత సేపు సంచరించి, సమీపాన గల వీధుల్లోకి వస్తున్నాయి. వీధుల్లో ఇళ్ల ఎదుట ఉన్న సామగ్రిని అపరిశుభ్రం చేస్తున్నాయి. గత వారం నుంచి ఇక్కడ పందుల సమస్య అధికంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ములగాడలో గుంపుగా సంచరిస్తున్న పందులు

జీవీఎంసీ దుకాణాలకు బహిరంగ వేలం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-4, 5 పరిధిలో గల వాణిజ్య సముదాయాలు, కల్యాణ మండపాలు, మార్కెట్లకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు ఆయా జోనల్ కమిషనర్లు ప్రకటనలో పేర్కొన్నారు. జీవీఎంసీ జోన్-4 పరిధిలో గల డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయం గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు, జగదాంబ వాణిజ్య సముదాయం, పాతబస్టాండ్ ఫేస్-2, పద్మానగర్ వాణిజ్య సముదాయం, సూర్యాబాగ్ వాణిజ్య సముదాయం, అంబేడ్కర్ కల్యాణ మండపం, రామకృష్ణా రైతు బజార్, రెల్లివీధి (రోడ్డు సైడ్) ఫిష్ మార్కెట్లకు మూడేళ్ల కాల పరిమితికి అద్దెకిచ్చేందుకు ఈ నెల 14 ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట జరుగుతుందని జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు తెలిపారు. జోన్-5 పరిధిలో గల 60వ వార్డు గుల్లలపాలెం షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు, త్రినాథపురం షాపింగ్ కాంప్లెక్స్ దుకాణం నంబరు 1, అలాగే 51వ వార్డు మాధవస్వామి కల్యాణ మండపం మూడేళ్ల కాలపరిమితికి, గుల్లలపాలెం దుకాణం రోడ్డు పక్కన మార్కెట్స్ హాకర్ మండలం, పల్లివీధి రోడ్ సైడ్ మార్కెట్, కంచరపాలెం రోడ్డు సైడ్ మార్కెట్, అక్కయ్యపాలెం రోడ్డు సైడ్ మార్కెట్లకు ఏడాదికి కాంట్రాక్ట్‌కు ఇచ్చేందుకు ఈ నెల 16 ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ బి. రాము తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలిచే వారు ధరావతు సొమ్ము తదితర పూర్తి వివరాలకు ఆయా జోనల్ కార్యాలయ పని రోజుల్లో పర్యవేక్షకులను సంప్రదించవచ్చని తెలిపారు.

సానుకూల దృక్పథం అలవర్చుకోవాలి

గాజువాక: ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని రామకృష్ణ మిషన్ స్వామీజీ శ్వాసం వేద్యానంద అన్నారు. వ్యక్తిత్వ వికాసంపై స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సానుకూల ఆలోచనలు, సానుకూల దృక్పథంతో ఉన్నత శిఖరాలను అందుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఎదురయ్యే అనుభవం ద్వారా ఎన్నో విషయాలను నేర్చుకోగలుగుతారన్నారు. వ్యక్తి నిర్మాణం, వ్యక్తి పరివర్తన, సంస్కారాలు, పరిసరాల ప్రభావం, సానుకూల దృక్పథం, అనుభవాలు తదితర అంశాల ద్వారా వ్యక్తిత్వ వికాసం అలవడుతుందన్నారు. ప్రతి అంశాన్ని ఒక అవకాశంగా భావించాలని సూచించారు. శ్రద్ధాసక్తులు, అంకితభావంతో ఉన్నత స్థితికి చేరుకోవచ్చన్నారు. కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంతోపాటు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు స్వామీజీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాళ్లు వి.తేజేశ్వరరావు, వై.ఈశ్వరరాజు, ఎస్.వి.కృష్ణ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న స్వామీ వేద్యానంద

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

డాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు తెలిపారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు అన్ని శాఖా గ్రంథాలయాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి ముగింపు ఉత్సవంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్టు చెప్పారు. అంతే కాక వారోత్సవాల్లో భాగంగా కవి సమ్మేళనం, గ్రంథ పాలకుల సదస్సు, మహిళా దినోత్సవం వంటి కార్యక్రమాలు ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడు కూడా నిర్వహిస్తున్నామని వెంకట్రావు తెలిపారు.



గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకట్రావు

రెండు ద్విచక్రవాహనాలు దగ్ధం

అగనంపూడి: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధి అగనంపూడి నిర్వాసితకాలనీలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయి. వాహనదారు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలసకు చెందిన బలిరెడ్డి రామారావు కుటుంబ సభ్యులతో కలిసి హైస్కూల్ వెనుక నివాసముంటున్నారు. రామారావు ఇంటి ముందు రోడ్డుమీద పార్క్ చేసి స్కూటీ, బైక్‌లు మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దగ్ధం కావడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాధితుడు రామారావు ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈసందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ కొంతమంది యువత మద్యానికి బానిసలుగా మారి ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని, విచారణ వేగవంతం చేసి సంఘనటకు గల కారణాలు తెలుసుకుంటామన్నారు.



దగ్ధమైన ద్విచక్రవాహనాలు

పార్థివదేహాలపై అవగాహన

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాలో ప్రవేశించిన 2024-25 ఎంబీబీఎస్ బ్యాచ్ విద్యార్థులకు పార్థివ దేహాలపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు ఈ సందర్భంగా వైద్య విద్యార్థులకు శరీర దానం ఆవశ్యకత గురించి వివరించారు. గత కొన్ని సంవత్సరాలుగా సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ సంస్థ తరఫున గూడూరు సీతామహాలక్ష్మి, కన్యాకుమారి, అట్లూరు జ్యోతి, పి.వెంకటరాజు పార్థివదేహాలను ఆంధ్రా మెడికల్ కాలేజీకి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనాటమీ విభాగాధిపతి డాక్టర్ రవీంద్ర కిశోర్, ప్రొఫెసర్ రాధిక, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ బంగారయ్య, డాక్టర్ సుష్మ, డాక్టర్ లక్ష్మణరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సురేఖ, డాక్టర్ విశ్వశాంతి, డాక్టర్ సుధీర్, డాక్టర్ దినేష్, డాక్టర్ నీరజ పాల్గొన్నారు.